
సాక్షి సంగారెడ్డి

సోమవారం ၊ 21 ၊ ఏప్రిల్ ၊ 2025



సోలార్ కుంటలు...

సోలార్ నీటికుంటల ద్వారా వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వివరాలు 8లో ▸



12,522 క్వింటాళ్ల కొనుగోలు

హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు ధాన్యం రాశులతో నిండిపోయింది.

వివరాలు 8లో ▸



పూత పూసింది కానీ...

జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు ప్రాంతాల్లో మామిడి పూత పూసినా వివిధ కారణాలతో కాత నిలబడటం లేదు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

కందిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



కందిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నవ సత్యాగ్రహలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

(సంగారెడ్డి): కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నవ సత్యాగ్రహ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన కందిలో ఆదివారం భారీ ర్యాలీ చేపట్టారు. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అనే ప్లకార్డులను ర్యాలీలో ప్రదర్శించారు. అనంతరం కంది చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బూడిద కుమార్, చిన్న సాయి శ్రీరామ్,అసద్ ఖాన్ శ్రీనివాస్,రాందాస్‌తోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విరమించేంత వరకూ పోరాడుతాం

డంపింగ్‌యార్డ్‌కు వ్యతిరేకంగా జేఏసీ నిరసనలు



దీక్షలో పాల్గొన్న గ్రామస్తులు, మహిళలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 75వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం గ్రామానికి చెందిన యువకులు, గ్రామస్తులు, మహిళలు, దివ్యాంగులు నల్లవల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రిలేనిరాహార దీక్షలో కూర్చొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం డంపింగ్‌యార్డ్ ఏర్పాటును విరమించేంత వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విషవాయువుల నుంచి కాపాడండి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని తరచూ పరిశ్రమలు వెదజల్లుతున్న విషవాయువుల నుంచి తమను కాపాడాలని నవ్య ది గ్రాండ్ కాలనీ వాసులు ఆదివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. శనివారం రాత్రి విష వాయువులతో తామంతా తీవ్రంగా ఇబ్బంది పడ్డామని..వారంలో ఒకసారి ఇదేవిధంగా జరుగుతోందని వివరించారు. చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి వారికి ఫిర్యాదు చేసినా ఫలితంలేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాలుష్య నియంత్రణ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేట పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జానకీదేవి ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. జాబ్ మేళాలో ఐదు కంపెనీలు పాల్గొంటున్నాయని, డిప్లొమా పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్పొరేట్ శక్తులకే అనుకూలం

సీఐటీయూ అఖిల భారత కోశాధికారి సాయిబాబు

పటాన్‌చెరు: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఆర్థిక విధానాలను అవలంబిస్తోందని ఈ నయా ఉదారవాద విధానాలపై పెద్ద ఎత్తున పోరాడాలని సీఐటీయూ అఖిలభారత కోశాధికారి సాయిబాబు పిలుపునిచ్చారు. పటాన్‌చెరులోని ఐలా భవన్‌లో తోషిబా పరిశ్రమలో సీఐటీయూ యూనియన్ స్థాపించి 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా 'నయా ఉదార వాద విధానాలు- లేబర్ కోడ్‌లు- కార్మికుల కర్తవ్యాలు'అనే అంశంపై ఆదివారం జరిగిన సెమినార్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రధాని నరేంద్రమోదీ కార్మిక వ్యతిరేకి అన్నారు. మోదీ అనుసరిస్తోన్న ఆర్థిక విధానాలతో ప్రజలకు, కూలీలకు, కార్మికులకు ఎవరికీ ఉపయోగపడటం లేదని విమర్శించారు. మే 20న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, రాజయ్య, పాండు రంగా రెడ్డి, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి సీఎస్ఐ చర్చిలో ఈస్టర్ వేడుకలు



రంజోల్‌లో దైవ సందేశం వినిపిస్తున్న పాస్టర్ రాధాకృష్ణ



చేక్రియాల్ లో ఈస్టర్ వేడుకలు

ఘనంగా ఈస్టర్ వేడుకలు

సంగారెడ్డి/జహీరాబాద్ టౌన్: జిల్లావ్యాప్తంగా ఈస్టర్ పండుగను క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈస్టర్ అంటే ఏసుక్రీస్తు శిలువ మరణమును పొంది చనిపోయి మూడవ దినమున లేచిన రోజు లేదా పునరుత్థానం పొందిన రోజుగా చెప్పుకుంటారని పాస్టర్లు సందేశం వినిపించారు. జిల్లా కేంద్రం సంగారెడ్డిలో ఉన్న సీఎస్ఐ చర్చిలో ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జయరాజ్ భక్తులనుద్దేశించి దైవసందేశం అందించారు. కార్యక్రమంలో రెవరెండ్ జార్జ్ ఎబినేజర్, సభ్యులు భాస్కర్ రావు,మాణిక్యరావు, ఆల్బర్ట్, జాన్ వెస్లీ రావు, సునీల్ నిర్మల్,ప్రవీణ్ కుమార్, జవహర్ యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు. జహీరాబాద్,మొగుడంపల్లి, రంజోల్, బాగారెడ్డిపల్లి మండలాల్లో భక్తులు ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు. సంగారెడ్డి పరిధిలోని చౌటుకూర్ మండలం ఛేక్రియాల్ గ్రామంలో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

చుక్క నీరు రాలే

కోట్లాది రూపాయలు ఖర్చుచేసి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి 22 ఏళ్లు దాటినా ప్రారంభానికి మాత్రం నోచుకోలేకపోయింది అమీరాబాద్ పంప్ హౌస్ పథకం. ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఈ పథకంలో వినియోగించిన సామగ్రి తుప్పుపడుతోంది. మరికొంత సామగ్రి దొంగల పాలవుతోంది. ప్రస్తుత ప్రభుత్వం నీటి ప్రాజెక్టుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుండటంతో ఈ పథకం ఎప్పుడు వినియోగంలోకి వస్తుందోనని రైతులు గంపెడాశలతో ఎదురు చూస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతాంగం పొలాల్లో పంటలు దక్కించుకోకపోగా రోజు రోజుకు వారి జీవన స్థితిగతులు దిగజారుతున్నాయి.

అలంకార ప్రాయంగా ఎత్తిపోతల పథకం

- ఏర్పాటు చేసి 22 ఏళ్లు.. నెరవేరని రైతుల ఆశలు
- దొంగల పాలవుతున్న పరికరాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారిన అమీరాబాద్ పథకం పంపుహౌస్

న్యాల్‌కల్ (జహీరాబాద్): బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు న్యాల్‌కల్ మండలం అమీరాబాద్ గ్రామ శివారులో మంజీరా నది తీరంలో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందులోభాగంగా 1993లో అప్పటి నారాయణఖేడ్ శాసన సభ్యుడు (దివంగత) పి.కిష్టారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయించారు. పథకం నిర్మాణం కోసం నాబార్డు పథకం కింద రూ.1.30కోట్లు మంజూరు చేయించారు. పథకం పనులు ప్రారంభించుదామనుకున్నా అదే సమయంలో శాసనసభ ఎన్నికలు రావడం, రాష్ట్రంలో ప్రభుత్వ మారడంతో పనులు ప్రారంభం కాలేదు. మళ్లీ ఐదేళ్ల తర్వాత జరిన ఎన్నికల్లో తిరిగి కిష్టారెడ్డి శాసన సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1999లో అప్పటి ఎమ్మెల్యే ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. నిధులు సరిపోక పోవడంతో పనులు నిలిచిపోయాయి. నాబార్డు ఆర్‌ఐడీఎఫ్ పేజ్–3లో రూ.88.80లక్షలు మంజూరు చేయించి మిగిలిపోయిన పనులు పూర్తి చేయించారు. ఈ పథకం ద్వారా 21మంది ఎస్సీలకు సంబంధించిన 49.36హెక్టార్లు, 31మంది బీసీలకు చెందిన 114.03హెక్టార్లు, ఇతర వర్గాలకు చెందిన 331.01హెక్టార్ల భూమిని సాగులోకి తేవాలన్నది ఈ పథకం ఉద్దేశం.

22 ఏళ్లు దాటినా ప్రారంభం కాని పథకం

ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి 22 ఏళ్లు దాటినా ఇప్పటికీ ప్రారంభం కాలేదు. దీంతో పథకం నిరుపయోగంగా మారింది. పథకం వినియోగంలోకి వస్తే బీడు భూములు సాగవుతాయని రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇక పంపుహౌస్ నుంచి పంట పొలాలకు నీరందించేందుకు గ్రామ సమీపం వరకు రూ.42లక్షల వ్యయంతో పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. పైప్‌లైన్ పనులు 2018లో పూర్తి అయ్యాయి. సంబంధిత కాంట్రాక్టర్ పనులను పూర్తి చేసినప్పటికీ సంపౌస్ నుంచి వచ్చే మేన్ పైప్‌లైన్ పలు ప్రాంతాలలో లీకేజీ అవుతుండటంతో పంట పొలాలకు నీరు వచ్చే అవకాశం లేకుండా పోయింది. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని పనులు త్వరితగతిన పూర్తి చేయించి పథకంను వినియోగంలోకి తేవాలని గ్రామ రైతులు కోరుతున్నారు.



తుప్పు పట్టి నిరుపయోగంగా మారిన పైప్ లైన్లు

పంపుహౌస్ ఏర్పాటు

ఈ పథకం ద్వారా పొలాలకు నీరందించేందుకు మంజీర నది తీరంలో పంపుహౌస్‌ను నిర్మించడంతోపాటు అందుకు అవసరమైన విద్యుత్ కోసం ట్రాన్స్‌ఫార్మర్లును కూడా ఏర్పాటు చేశారు. పంపుహౌస్ నుంచి పొలాలకు పైప్‌లైన్ వేశారు. ఇవన్నీ చేసిన అధికారులు దీనిని ప్రారంభించడం మాత్రం మరిచారు. అప్పట్లో పనులు కూడా నాసిరకంగా జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. అక్కడ విద్యుత్ స్తంభాలు ఒంగిపోయి ప్రమాదకరంగా మారాయి. వాటిని ఏడాదిన్నర క్రితం మరమ్మతు చేయించారు.

రైతుల కమిటీ ఏది?

ఎత్తి పోతల పథకం నిర్వహణకు సంబంధించి రైతులతో కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు దాని ప్రస్తావనే లేదు. పథకం వల్ల కలిగే ప్రయోజనాలను గూర్చి చాలా మంది రైతులకు సరైన అవగాహన కూడా లేదు. ఇలా అనేక కారణాల వల్ల ఈ పథకం వినియోగంలోకి రావడం లేదు. ఈ ఏడాదైనా ఈ పథకాన్ని వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు పంప్‌హౌస్‌లోని విద్యుత్ మోటార్లు పగుల గొట్టి అందులోని విలువైన కాపర్‌వైర్‌ను ఎత్తుకెళ్లారు.



పొలాలకు నీరందించేందుకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్

అధికారులు పట్టించుకోవడం లేదు



మాకు రెండు ఎకరాల పొలం ఉంది. వర్షం పడితే అందులో పంట పండుతుంది. ఊరు పక్కనే నదిలో నీరు ఉన్న చాలా రోజుల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా పంట పొలాలకు నీళ్ల రావడం లేదు. అధికారులు చర్యలు తీసుకుని పథకంను ప్రారంభించాలి.

– శిరోమణి రైతు, అమీరాబాద్

ఏళ్లు గడిచినా



మాకు ఎకరంన్నర పొలం ఉంది. ఉన్న కొద్ది భూమి కూడా గట్టు పక్కనే ఉన్నందున అంతబాగా లేదు. నీరు వస్తే పంటలు పండించుకోవచ్చు. ఎత్తిపోతల పథకం పని చేయకపోవడం వల్ల నీరు రావడం లేదు.

– పవన్ రైతు, అమీరాబాద్

సామగ్రి పని చేయదు

ఎత్తి పోతల పథకం చాలా కాలం క్రితం ఏర్పాటు చేయడం వల్ల దానికి సంబంధించిన సామగ్రి పూర్తిగా పాడైపోయింది. పైప్‌లైన్ కూడా దెబ్బతింది. ప్రస్తుతం ఉన్న యంత్రాలు, సామగ్రి ద్వారా పథకం పని చేయదు. కొత్త వాటిని ఏర్పాటు చేస్తే వినియోగంలోకి తేవచ్చు.

– జనార్దన్‌రావు, లిఫ్ట్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ డీఈఈ

చివరి గింజవరకూ కొంటాం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: రైతుల మేలుకోసమే రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని, చివరి గింజవరకూ ధాన్యాన్ని కొంటామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. నిజాంపేట్ మండలం జంబికుంట గ్రామంలో ఆదివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గత ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. తమ ప్రభుత్వం రైతులకు పనిముట్లు, విత్తనాలు సైతం అందజేస్తామని తెలిపారు. ధరణి పోర్టల్‌తో ఇన్నాళ్లూ రైతులు పడ్డ కష్టాలు భూ భారతితో తొలగిపోయాయని వివరించారు. భూ భారతి ద్వారా ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు కూడా పరిష్కారమవుతాయని వెల్లడించారు.

అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ట

ఖేడ్ మండలం నమ్లిమెట్ గ్రామంలో దుర్గాభవానీ మాత ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి సంజీవరెడ్డి, అనుపమారెడ్డి దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామపెద్దలు వారిని శాలువాతో సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖేడ్ మున్సిపాలిటీలో నీటి సరాఫరా విభాగం సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న జన్వాడె బస్వరాజ్ మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం ఆయన స్వగ్రామమైన సిర్గాపూర్ మండలం చిన్నముబారక్ పూర్ గ్రామానికి సంజీవరెడ్డి వెళ్లి బాధిత కుటుంబీకులను పరామర్శించారు. వారికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీవో సంగ్రాం, కాంగ్రెస్ నాయకులు అంతన్నగారి మల్లేశం, రాధాకిషన్, నాయకులు యాదవరెడ్డి, అశోక్‌పాటిల్, పండరిరెడ్డి తదితరులు ఉన్నారు.

పక్షం రోజుల్లో అందరికీ రైతుభరోసా

- జహీరాబాద్ ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్
- తడ్కల్ మండలం ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం

కంగ్టి(నారాయణఖేడ్): పక్షం రోజుల్లో రైతులందరికీ రైతు భరోసా అందజేస్తామని ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్ స్పష్టం చేశారు. కంగ్టి మండలంలోని తడ్కల్ రైతు వేదికలో కంగ్టి ప్యాక్స్ చైర్మన్ మారుతి రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఎనిమిదిన్నర లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. రూ. 2 లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ...తడ్కల్ మండలం ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామన్నారు. గతంలో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లిస్తే తడ్కల్‌లో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. రేషన్‌లో సన్నబియ్యం ఉచితంగా ఇస్తున్నా నూకలు ఇచ్చారని సోషల్ మీడియాలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.



తడ్కల్ రైతు వేదికలో మాట్లాడుతున్న ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

రోహింగ్యాలకు అడ్డాగా సంగారెడ్డి

వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి శశిధర్

సంగారెడ్డి: సంగారెడ్డి పట్టణం రోహింగ్య ముస్లింలకు అడ్డాగా మారుతోందని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణ శివారులోని ఆదివారం శిశు మందిరంలో నిర్వహించిన విశ్వహిందూ పరిషత్ సంగారెడ్డి జిల్లా ధర్మ ప్రసాద్ సమితి కార్యవర్గ ప్రశిక్షణ సమావేశానికి హాజరై మాట్లాడారు. సంగారెడ్డి పట్టణంలోని శాతినగర్ కాలనీలో ఓ ఇంటిని అక్రమంగా మసీదుగా మార్చి అక్కడ నివసిస్తున్న హిందువులను అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ మసీదు వద్దకు గుర్తు తెలియని అనుమానాస్పద వ్యక్తులు వచ్చి వెళ్తున్నారని అధికారులకు చెప్పినా తగిన విచారణ చేయడం లేదని మండిపడ్డారు.

సంచారం లేని శౌచాలయం

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ప్రజాధనం వృథా

సంగారెడ్డి: గత కొన్ని నెలలుగా పబ్లిక్ టాయిలెట్ బస్సు మూలన పడింది. సంగారెడ్డి పట్టణంలో వివిధ మార్కెట్లలో ప్రజల సౌకర్యార్థం ఉంచేందుకు లక్షల రూపాయలు వెచ్చించి మొబైల్ టాయిలెట్ బస్సును కొనుగోలు చేశారు. కొన్ని రోజులు వాడి చేతులు దులుపుకున్నారు. సంవత్సరం పాటుగా ఈ బస్సు పాత కలెక్టరేట్ కార్యాలయంలో ఓ మూలన పడి ఉంది. పట్టణంలో జరిగే సంతలలో పబ్లిక్ టాయిలెట్స్ లేక అక్కడికి వచ్చే వ్యాపారులు,కొనుగోలుదారులు ఇబ్బందులకు ఎదుర్కొంటున్నా అధికారుల్లో మాత్రం కదలిక లేదు. ఇప్పటికైనా పబ్లిక్ టాయిలెట్ బస్సును సంతలో ఉంచి తమ సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



కలెక్టరేట్ కార్యాలయంలో మూలన పడి ఉన్న మొబైల్ టాయిలెట్ బస్సు

మా బాధలు ఎవరికి చెప్పాలి

ప్రతీ అంగడి రోజు ఉదయం 10 గంటలకు సంతలోకి వచ్చి రాత్రి 8 గంటల వరకు కూరగాయల అమ్ముకుంటున్నాను. శౌచాలయాలు లేక ఉదయం నుంచి రాత్రి వరకు మూత్రానికి కూడా పోవడం లేదు. అధికారులు గతంలో ఇక్కడ బస్సు ఉంచేవారు. ఇప్పుడు ఆ బస్సు కూడా లేకపోవడంతో పరిస్థితి మరీ దారుణంగా మారింది.

– అంజమ్మ, కూరగాయల వ్యాపారి

ప్రజాధనం వృథా

ప్రజల అవసరాల కోసం లక్షలు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేస్తున్నారు తప్ప వాటిని ఉపయోగించడం లేదు. పన్నులు మాత్రం ముక్కు పిండి వసూలు చేస్తున్నారేగానీ వాటికి తగ్గ సౌకర్యాలు కల్పించడం లేదు.

– మల్లేశం, సంగారెడ్డి

ఈవెంట్స్ అయితేనే పెడుతున్నాం



పట్టణంలో ఏవైనా ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలు అయితే మొబైల్ టాయిలెట్ బస్సు వాడుతున్నాం. మార్కెట్లలో పెట్టే సంగతి నాకు తెలియదు. ఇక పైనుంచి మొబైల్ టాయిలెట్లు అన్ని మార్కెట్లలో ఉంచే విధంగా చర్యలు తీసుకుంటాం.

–ప్రసాద్ చౌహన్, మున్సిపల్ కమిషనర్

యువ 'వికాసం'

- స్వయం ఉపాధికి అనూహ్య స్పందన
- భారీగా దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు
- నాలుగు కేటగిరీలుగా యూనిట్ల విభజన

నారాయణఖేడ్: నిరుద్యోగ యువతను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు తలపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లాలో అనూహ్య స్పందన లభించింది. ఆయా వర్గాలకు చెందిన నిరుద్యోగుల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయి. అన్ని వర్గాల నుంచి అనూహ్య స్పందన లభించగా బీసీ వర్గాల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చి పడ్డాయి. రూ.50వేలు మొదలుకుని రూ.4లక్షల వరకు రుణం పొందేందుకు పథకాలను నిర్ణయించారు. ఈనెల 14వ తేదీతో దరఖాస్తు సమర్పణకు ప్రభుత్వం ఆన్‌లైన్‌లో చివరి తేదీగా నిర్ణయించింది. జిల్లా మొత్తంలో 51,657మంది దరఖాస్తులు సమర్పించారు. అత్యధికంగా బీసీ వర్గాల నుంచి 6,546 యూనిట్లకుగాను 23,681, ఎస్సీ విభాగంలో 7,415 యూనిట్లకు 14,480, మైనార్టీ విభాగంలో 2,456 యూనిట్లకు 8,378, ఎస్టీ విభాగంలో 2,502 యూనిట్లకు 4,232, ఈబీసీలో 1,654 యూనిట్లకు 817 దరఖాస్తులను సమర్పించారు.

నాలుగు కేటగిరీలుగా విభజన

రాజీవ్ యువ వికాసం పథకాన్ని నాలుగు కేటగిరీలుగా విభజించారు. రూ.50వేల లోపు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారిని కేటగిరీ 1లో చేర్చారు. రూ.50వేల నుంచి రూ.1లక్ష మధ్య ఉన్న దరఖాస్తు దారులను కేటగిరీ 2లో, రూ.1లక్ష నుంచి రూ.2లక్షల మధ్య ఉన్న దరఖాస్తులను కేటగిరీ 3గా, రూ.2లక్షల నుంచి రూ.4లక్షల మధ్య ఉన్న దరఖాస్తులను కేటగిరీ 4లో చేర్చారు. కేటగిరీ 1 కింద వందశాతం రాయితీతో రూ.50వేల రుణం మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, వచ్చిన దరఖాస్తుల్లో 4వ కేటగిరీ కిందనే అత్యధికంగా వచ్చినట్లు అధికారులు గుర్తించారు. నిరుద్యోగులు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. 2025– 26 వార్షిక బడ్జెట్‌లో ఈ పథకం కింద రూ.6వేల కోట్ల భారీ నిధిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. గరిష్టంగా 4లక్షల మందికి సాయం అందించేందుకు లక్ష్యంగా నిర్దేశించుకుంది.



నెలాఖరు నుంచి పరిశీలన

యువత చేసుకున్న దరఖాస్తులపై ఈ నెలాఖరు నుంచి మండలాల్లో వెరిఫికేషన్ చేయనున్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల నేతృత్వంలోని మండల కమిటీ దరఖాస్తు చేసుకున్న వారిని వచ్చేనెల 20వరకు గుర్తిస్తుంది. అనంతరం ఆ జాబితాను జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీకి సిఫారసు చేస్తుంది. మే 21 నుంచి మే 31 వరకు ఈ జాబితాలో ఉన్న వారిని మరింత వడబోసి కలెక్టర్ ఆధ్వర్యంలోని బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ శాఖల అధికారుల జిల్లా కమిటీ ఎంపిక చేస్తుంది. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా యూనిట్లను మంజూరు చేసి వారికి ప్రొసీడింగ్స్‌ను అందజేస్తారు. ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాన్ని తిరిగి ప్రవేశ పెట్టడంతో యువతలో ఆశలు రేకెత్తించినట్లైంది. ఈ పథకంలో మొదట నిస్సహాయులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నిరుద్యోగులు, ఇదివరకు ప్రభుత్వం నుంచి స్వయం ఉపాధి పథకాల రుణాలు పొందని వారికి ప్రాధాన్యతా క్రమంలో మంజూరు చేయనున్నారు. పథకం కింద అర్హత పొందిన వారికి రెండు దఫాలుగా వారి ఖాతాల్లో నగదు జమకానుంది. తొలుత సగభాగం యూనిట్లు కొనుగోలు చేసే సమయంలో, మిగిలిన సగభాగం యూనిట్లు కొనుగోలు చేసిన తర్వాత అందజేయనున్నారు.

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

పటాన్‌చెరు టౌన్ : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడు శివ కుమార్ కథనం ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సాయి కాలనీకి చెందిన శివకుమార్ ఈ నెల 18వ తేదీన సదాశివపేట్‌లో ఉండే బంధువుల ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇంటి యజమాని శ్రీనివాస్ ఫోన్ చేసి మీ ఇంటి తాళం పగలగొట్టి ఉందని అతడికి సమాచారం ఇచ్చారు. ఇంటికి వచ్చిన అతడు ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. గుర్తు తెలియని దండుగులు ఐదు తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

కొండపాక(గజ్వేల్): ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా పశువులను తరలిస్తున్న దుద్దెడకు చెందిన పలువురిని అడ్డగించి పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం సిద్దిపేట నుంచి కొండపాక వైపు బొలెరో వాహనంలో 9 ఆవులు, ఒక లేగను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తుండగా మురళి అనే వ్యక్తి గమనించి హిందూవాహిని సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీసులకు తెలిపారు. దీంతో త్రీటౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని దుద్దెడ టోల్‌గేట్ వద్ద వాహనాన్ని అడ్డగించి డ్రైవర్‌ను విచారించారు. నల్లగొండ సంత నుంచి హైద్రాబాద్‌లోని మూసాపేట్‌కు తరలిస్తున్నట్లు డ్రైవర్ తెలిపాడు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారని తేలడంతో వాటిని పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ట్రావెల్ బస్సుకు తప్పిన ప్రమాదం

తూప్రాన్: ట్రావెల్ బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటన పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం, ప్రయాణికుల కథనం ప్రకారం... పట్టణ సమీపంలోని నాగులపల్లి చౌరస్తా సమీపంలోని హల్దీవాగు వద్ద రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న విశ్వకర్మ ట్రావెల్స్ బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. తూప్రాన్ పట్టణ సమీపంలోని హల్దీవాగు వద్దకు చేరుకోగానే బస్సు ముందు చక్రాలు ఊడిపోయి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ప్రయాణికుల్లో కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పోలీసులు కేసు నమేదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బస్సును ఢీకొట్టిన కారు

– పలువురికి స్వల్ప గాయాలు



ప్రమాదానికి గురై రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు

నర్సాపూర్ రూరల్: కారు ముందు టైర్ పేలి అదుపుతప్పి బస్సును ఢీకొట్టింది. ఈ ఘటన నర్సాపూర్ – మెదక్ జాతీయ రహదారిపై రెడ్డిపల్లి సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... ఇద్దరు భక్తులు ఏడుపాయల వనదుర్గా మాతను దర్శనం చేసుకొని కారులో నర్సాపూర్ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో రెడ్డిపల్లి సమీపంలో కారు ముందు టైరు పేలి అదుపు తప్పడంతో మెదక్ వైపు ప్రయాణికులతో వెళ్తున్న బస్సును ఢీకొట్టి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ప్రయాణికులకు, కారులో ఉన్న ఇద్దరు భక్తులకు సైతం స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ స్వామి సమన్వయంతో బస్సును అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న భక్తుల వివరాలు తెలియరాలేదు.

బస్సు కిందపడి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్ : బస్సు ఎక్కుతున్న క్రమంలో ఓ వ్యక్తి కింద పడగా అతడి కుడి కాలు పై నుంచి బస్సు వెనుక టైర్ వెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా చికిత్సకు తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఉత్తర ప్రదేశ్‌కు చెందిన జాన్ మొహమ్మద్ (40) బతుకుదెరువు కోసం 20 ఏళ్ల క్రితం వచ్చి పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కటిక బస్తీలో నివాసం ఉంటూ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సంగారెడ్డిలో ఉన్న లారీని తీసుకువచ్చేందుకు బస్టాండ్‌లో పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎక్కుతున్న క్రమంలో కింద పడ్డాడు. దీంతో అతడి కుడికాలుపై నుంచి బస్సు వెనుక టైర్ వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని చికిత్స కోసం 108 వాహనంలో పటాన్‌చెరు, సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే తన భర్త మృతి చెందాడని మృతుడి భార్య ఫుల్జాహ బేగం ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నీటికోసం వచ్చి బావిలో పడి మృతి చెందిన జింక (ఫైల్)



నీటి కోసం వచ్చిన నెమళ్లు



నీరు తాగుతున్న దుప్పిలు

వన్యప్రాణుల దాహార్తికి సోలార్ కుంటలు

సౌరశక్తితో నీటి సరఫరా

- చెక్ డ్యామ్‌లు, కుంటల్లో నీరు అడుగంటడంతో ప్రత్యామ్నాయ చర్యలు
- నీరు లేక బయటకు వచ్చి మృత్యువాత పడుతున్న జంతువులు
- శనిగరం, మీర్జాపూర్, గురువన్నపేట ఫారెస్టులో ఏర్పాటుకు ప్రతిపాదనలు
- హుస్నాబాద్ ఫారెస్టు పరిధిలో 7 మండలాలు 4వేల హెక్టార్లు



దుబ్బాక డివిజన్‌లో ఏర్పాటు చేసిన సోలార్ నీటి కుంట

హుస్నాబాద్ రూరల్: వేసవిలో అడవిలో నీటి వనరులు లేక దాహం కోసం బయటకు వచ్చిన జంతువులు వేటగాళ్ల ఉచ్చులకు బలై మృత్యువాత పడుతున్నాయి. జింకల మందలు మైదానానికి రావడంతో కుక్కలు తరుమడంతో ప్రమాదవశాత్తు వ్యవసాయ బావుల్లో పడి ప్రాణాలు కోల్పోతున్నాయి. అడవి జంతువుల దాహార్తి తీర్చడానికి సోలార్ పంపుల ద్వారా నీటి కుంటలు ఏర్పాటు చేయడానికి అటవీశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. వేసవిలో సైతం నీటి కుంటలు నిండుగా ఉంటే జంతువులు అడవి విడిచి బయటకు రావనే ఆలోచనతో అధికారులు సౌరశక్తి కుంటల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. దుబ్బాక ఫారెస్టు పరిధిలో చింతమడక, చీకోడులో సోలార్ కుంటలు నిర్మించి జంతువులకు నీరు అందిస్తున్నారు.

హుస్నాబాద్ ఫారెస్టు..

హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి, మద్దూరు, ధూళిమిట్ట, చేర్యాల ఏడు మండలాల్లో 4వేల హెక్టార్లలో విస్తరించి ఉంది. ఈ అడవిలో జింకలు, కొండ గొర్రెలు, నక్కలు, ఎలుగు బంట్లు, హైనా, నెమళ్లు లాంటి జంతువులు ఉన్నాయి. 2017లో మహ్మదాపూర్ గుట్టల్లో చిరుతపులి దాహం కోసం వ్యవసాయ బావుల వద్దకు వచ్చి వేటగాళ్ల ఉచ్చులకు చిక్కి బలైపోయింది. అప్పటి నుంచే జంతువుల దాహార్తికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే 3వేల నుంచి 5వేల లీటర్ల సామర్థ్యం కలిగిన 19 సాసర్లు నిర్మించి ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. వర్షాకాలం నీటిని నిల్వ చేయడానికి లోతట్టు ప్రాంతంలో 10 చెక్ డ్యామ్‌లు, 8 కుంటలను నిర్మించారు. హుస్నాబాద్ మండలంలోని ఉమ్మాపూర్ అటవీ ప్రాంతంలో మహాసముద్రం, జిల్లెలగడ్డలో గాడిదలొద్ది చిన్ననీటి జలాశయాలను నిర్మించడంతో జంతువులు బయటకు రాకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

బాంబుల శబ్దాలకు భయపడి బయటకు..

ఉమ్మాపూర్ అటవీ ప్రాంతంలో మిషన్లతో గుట్టలను తవ్వడం, బండరాళ్లను తొలగించడానికి బాంబులను వినియోగించడం వల్ల పెద్ద పెద్ద శబ్దాలకు జంతువులు భయపడి బయటకు వస్తున్నాయి. అధికారులు వన్యప్రాణుల సంరక్షణకు అటవీ ప్రాంతంలో గుట్టల తవ్వకాలను, బాంబు పేలుళ్లను నిషేధించాలని వన్యప్రాణుల సంరక్షణ సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

కుంటల ఏర్పాటు

వర్షాలు లేక వేసవిలో చిన్న నీటి జలాశయాలు ఎండిపోతే జంతువులు నీటి కోసం మైదాన ప్రాంతాలకు వెళ్లకుండా నిరంతరం నీరు ఉండే విధంగా సౌరశక్తి పంపు సెట్ల ద్వారా కుంటల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మొదట శనిగరం, మీర్జాపూర్, గురువన్నపేట అటవీ ప్రాంతంలో నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఒక్కొక్క సోలార్ నీటి కుంట నిర్మాణానికి రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వ్యయం అవుతుందని అంచనా. సోలార్ పంపులు బిగిస్తే కాలంతో పని లేకుండా కుంటల నిండా నీరు ఉంటుందని, దీంతో జంతువులు అడవిని దాటి దాటి బయకు రావని పేర్కొన్నారు.

నీటి సరఫరాకు ట్యాంకర్లు ఇవ్వాలి

వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో అడవిలో నీటి లభ్యత తగ్గిపోతోంది. మేము నిర్మించే సాసర్ పిట్లకు నీటి సరఫరా కోసం సమీపంలోని గ్రామ పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలి. శనిగరం, మీర్జాపూర్, గురువన్నపేట అటవీ ప్రాంతంలో సౌరశక్తి పంపుల ద్వారా నీటి కుంటల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం .నిధులు మంజూరైతే అడవిలో నిరంతరం జంతువులకు నీరు దొరుకుతుంది. అడవిలో పలు రకాల జంతువులు ఉన్నాయి. పులులు ఇప్పటి వరకు ఎక్కడా కెమెరాలకు చిక్కలేదు.

– సిద్ధార్థరెడ్డి, ఎఫ్ఆర్ఓ, హుస్నాబాద్

దుబాయిలో చిక్కుకున్న వ్యక్తికి ఆపన్నహస్తం

హుస్నాబాద్: తాను దుబాయిలో చిక్కుకున్నానని రక్షించాలని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన చొప్పరి లింగయ్య అనే గల్ఫ్ కార్మికుడు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను వేడుకుంటూ ఇటీవల ఓ సెల్ఫీ వీడియో పంపించాడు. వెంటనే స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ విషయాన్ని ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్ డాక్టర్ బిఎం. వినోద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన దుబాయిలోని సామాజిక సేవకులు సుతారి సత్యం పటేల్‌ను సంప్రదించి లింగయ్యకు అవసరమైన సహాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా దౌత్య ప్రయత్నాలు కూడా కొనసాగుతున్నాయి.

విద్యుత్ వైర్లు తగిలి పశుగ్రాసం దగ్ధం



రోడ్డు పై మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): ప్రమాదభరితంగా కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగలడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదివారం పోతులబోగూడ నుంచి ఉసిరికపల్లి వైపునకు గడ్డి లోడ్‌తో (పశుగ్రాసం) వస్తున్న ట్రాక్టర్‌కు పాంబండ వద్ద 11 కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు చెలరేగాయి. గుర్తించిన ట్రాక్టర్ డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించి గడ్డి లోడ్‌కు కట్టిన తాడు తొలగించి ట్రాలీని లేపి గడ్డిని కింద పడేశాడు. దీంతో వెల్దుర్తి– ఉసిరికపల్లి ప్రధాన రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న నర్సాపూర్ అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో మంటలను ఆర్పివేసి రాకపోకలను పునరుద్ధరించారు. నూతనంగా రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల రోడ్డు ఎత్తు పెరిగి విద్యుత్ వైర్లు పలు చోట్ల కిందికి ప్రమాదభరితంగా వేలాడుతుండటం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపించారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

వేర్వేరు చోట్ల ఇద్దరు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు.



బేతయ్య (ఫైల్)

పెద్ద శంకరంపేట(మెదక్): వరి పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన పెద్ద శంకరంపేట మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శంకర్ కథనం ప్రకారం... మక్త లక్ష్మాపూర్‌కు చెందిన నాగధర్ బేతయ్య(50) తాను సాగు చేస్తున్న వరి పంటను అడవి పందుల నుంచి రక్షించేందుకు చుట్టూ విద్యుత్ వైర్లను ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు జామున పంట పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తగలడంతో రైతు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతుడి భార్య దుర్గమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో కరెంట్ రావట్లేదని చెక్ చేస్తుండగా..

మద్దూరు(హుస్నాబాద్): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని లద్నూరు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మచ్చ యాదగిరి(48) అనే వ్యక్తి గత 15 ఏళ్లుగా హైదరాబాద్‌లో కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తన స్వగ్రామంలో జరిగే బొడ్రాయి పండుగ కోసం కుటుంబ సభ్యులతో కలిసి గ్రామానికి వచ్చాడు. సాయంత్రం ఇంట్లో కరెంట్ రాకపోవడంతో విద్యుత్ స్తంభం వద్దకు వెళ్లి చెక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు అతడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

చిరుతపులి దాడిలో లేగదూడ మృతి



నారాయణఖేడ్: మృతి చెందిన లేగదూడ వద్ద రైతులు

నారాయణఖేడ్: లేగదూడపై చిరుతపులి దాడి చేసి చంపింది. ఈ ఘటన ఆదివారం నారాయణఖేడ్ మండలంలో జరిగింది. బాధిత రైతు నారాయణ, గ్రామస్తుల కథనం ప్రకారం.. సంజీవన్‌రావుపేట్ గ్రామానికి చెందిన రైతు నారాయణ శనివారం రాత్రి గ్రామ శివారులోని తన చేను వద్ద పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా లేగదూడ శరీరం ఛిద్రమై మృతిచెంది ఉంది. గ్రామానికి కొద్దిదూరంలో అటవీ ప్రాంతం ఉండటంతో చిరుతపులి వచ్చి లేగదూడపై దాడి చేసి ఉండవచ్చని అనుమానించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ సిబ్బంది సందర్శించి పరిసరాల్లో గుర్తించిన పాదముద్రల ఆధారంగా చిరుతపులి సంచరించినట్లు నిర్ధారించారు. దీంతో గ్రామస్తుల్లో భయాందోళన నెలకొంది. ఖేడ్ అటవీశాఖ రేంజ్ అధికారి అనురాధ మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులను చేను వద్ద కట్టేయవద్దని సూచించారు. చిరుత ఎవరికైనా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు.

పటాన్‌చెరు టౌన్: స్కూటీని కారు ఢీకొట్టిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు కథనం ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ భూపాల్ రెడ్డి కాలనీకి చెందిన షేక్ ఇబ్రహీం (50), అతడి బంధువు ఎం.డి ఖాజా ఇరువురు కలిసి శనివారం స్కూటీపై కిష్టారెడ్డిపేట్ వైపు నుంచి పటాన్‌చెరు వైపు వస్తుండగా మార్గమధ్యలో ఎల్లంకి కాలేజీ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటీపై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం షేక్ ఇబ్రహీంను మదీనాగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని ఒకరు..



దశరథ్

హత్నూర(సంగారెడ్డి): ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హత్నూర మండలం దేవులపల్లి గ్రామ శివారులో దౌల్తాబాద్ రోడ్డుపై శనివారం రాత్రి జరిగింది. ఎస్సై సుభాష్ కథనం ప్రకారం... మాదుర గ్రామానికి చెందిన లింగన్నగారి దశరథ్ రోజువారి మాదిరిగానే దౌల్తాబాద్ వచ్చి రాత్రి స్వగ్రామానికి తన మోటార్ సైకిల్ పై తిరిగి వెళ్తున్నాడు. దేవులపల్లి గ్రామ శివారులోకి చేరుకోగానే హత్నూర వైపు నుంచి ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దశరథ్ (45)తలకు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి కూడా గాయాలయ్యాయి. ముగ్గురిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ దశరథను పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గాయాలైన ఇద్దరికీ చికిత్స అందిస్తున్నారు. మృతుడి భార్య వీరమని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

సిద్దిపేటకమాన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. చిన్నకోడూరు మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన ఎమ్ శివయ్య (52) సోమవారం పట్టణంలోని ఓ వివాహ వేడుకకు హాజరయ్యాడు. తిరిగి తన ద్విచక్ర వాహనంపై సిద్దిపేట నుంచి రామునిపట్ల వైపు వెళుతుండగా మందపల్లి స్టేజ్ వద్ద రాజీవ్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన అతడు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

గజ్వేల్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన మండల పరిధిలోని దాచారంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన వల్లెపు యాదగిరికి 20 ఏళ్ల క్రితం నర్సమ్మ అనే మహిళతో వివాహం జరుగగా ఆమె మృతి చెందింది. దీంతో ఆరేళ్ల క్రితం కామారెడ్డి ప్రాంతానికి చెందిన శ్రీలతను రెండో వివాహం చేసుకోగా వీరికి రెండేళ్ల కూతురు ఉంది. అప్పుడప్పుడు దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 16న ఓ పరిశ్రమలో పనికోసం వెళ్లిన యాదగిరి రాత్రి ఇంటికి వచ్చే సరికి భార్య కనిపించలేదు. దీంతో పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుస్తులు అమ్మడానికి వెళ్లిన యువకుడు



బాబులు సింగ్

రామాయంపేట(మెదక్): దుస్తులు అమ్మడానికి వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ బాల్‌రాజ్ కథనం ప్రకారం... ఉత్తరప్రదేశ్‌లోని ఖానాపూర్ జిల్లా అలపూర్ గ్రామానికి చెందిన బాబులు సింగ్ (23) నాలుగేళ్ల క్రితం రామాయంపేటకు వచ్చి దుస్తుల వ్యాపారం చేస్తున్నాడు. ఈనెల 18న ఉదయం దుస్తులు అమ్మడానికి బైక్‌పై బోడ్మట్‌పల్లి వైపు వెళ్లి తిరిగి రాలేదు. రెండు రోజులుగా అతడి ఆచూకీ లభించకపోవడంతో పాటు ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. అతడి బంధువులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాబాల్లో పోలీసుల తనిఖీలు



దాబాలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తూప్రాన్: పట్టణ సమీపంలో ఉన్న దాబాల్లో ఎస్ఐ శివానందం ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 44 జాతీయ రహదారిపై ఉన్న దాబాల్లో అక్రమ మద్యం సిట్టింగ్‌లు, మత్తు పదార్థాలు నార్కోటిక్ డాక్ సహాయంలో తదితర అంశాలను తనిఖీ చేశారు. చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ఇరు వర్గాల మధ్య విభేదాలు

మిరుదొడ్డిలో పోలీసుల పికెట్



మిరుదొడ్డిలో పికెట్ నిర్వహిస్తున్న ర్యాపిడ్ పోలీసులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఒక వర్గానికి చెందిన వారి మనోభావాలు దెబ్బ తీసేలా ఓ వర్గం యువకుడు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఇరు వర్గాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. పోలీసుల కథనం ప్రకారం... బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఒక వర్గానికి చెందిన యువకులు శనివారం రాత్రి మిరుదొడ్డి మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి ఇదే గ్రామానికి చెందిన ఓ వర్గానికి చెందిన యువకుడు సోషల్ మీడియాలో కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తూ పోస్టు చేశాడు. దీంతో తమ మనోభావాలను దెబ్బ తీసే విధంగా పోస్టు పెట్టిన యువకుడి ఇంటి ఎదుట ఆందోళన చేయడానికి ఒక వర్గం యువకులు సమాయత్తమయ్యారు. విషయం తెలుసుకున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు అడ్డుకున్నారు. ఫిర్యాదు చేస్తే యువకుడిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పారు. దీంతో సదరు యువకుడిపై అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదైన యువకుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. కాగా ఇరు వర్గాల మధ్య తలెత్తిన విభేదాల నేపథ్యంలో ఆదివారం గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ర్యాపిడ్ పోలీసులతో పికెట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దుబ్బాక సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ సోషల్ మీడియాను మంచికి వాడకుండా ఇతరుల మనోభావాలను దెబ్బ తీసేలా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

229 మంది రైతులు.. 12,522 క్వింటాళ్ల కొనుగోలు

- హుస్నాబాద్ మార్కెట్ అంతా వరి ధాన్యం
- తాలు లేకుండా శుభ్ర పరిచేందుకు ప్యాడీ క్లీనర్లు
- వర్షానికి ధాన్యం తడవకుండా టార్పాలిన్లు ఏర్పాటు
- కాంటాలు పెట్టిన వెంటనే మిల్లులకు తరలింపు



మార్కెట్ యార్డులో రైతులు ఆరబోసిన ధాన్యం రాశులు

హుస్నాబాద్: వ్యవసాయ మార్కెట్ యార్డు వరి ధాన్యం రాశులతో నిండిపోయింది. ఎండను లెక్క చేయకుండా తాలు లేకుండా శుభ్రం చేసుకుంటూ రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ నెల 4వ తేదీన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సింగిల్ విండో ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ.. వ్యవసాయ మార్కెట్ ద్వారా రైతులకు అవసరమయ్యే సౌకర్యాలను సమకూరుస్తున్నారు. హుస్నాబాద్ పట్టణం నుంచే కాకుండా వివిధ గ్రామాల రైతులు తమ ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. ఇప్పటికే 12,522 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఎండ తీవ్రత అధికం కావడం, అనుకున్న తేమ శాతం రావడంతో పచ్చి వడ్లను నేరుగా మిల్లులకు అమ్మకుండా కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి అమ్ముకుంటున్నారు.

పెరుగుతున్న కొనుగోళ్లు..

మార్కెట్ యార్డులో రైతులు తీసుకొచ్చిన వరి ధాన్యం క్వింటాల్‌కు గ్రేడ్ –1 రకం రూ.2320, గ్రేడ్ –2 రకానికి క్వింటాల్‌కు రూ.2300 గిట్టుబాటు ధర చెల్లిస్తున్నారు. రైతులకు కావాల్సిన గన్నీ సంచులను అందుబాటులో ఉంచారు. ధాన్యాన్ని తాలు లేకుండా శుభ్ర పరిచేందుకు 4 ప్యాడీ క్లీనర్లు, 2లిఫ్టర్లు, వర్షానికి ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచారు. ఇప్పటి వరకు మార్కెట్ యార్డు 229 మంది రైతులు, 12,522 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. ధాన్యాన్ని కాంటా పెట్టగానే లారీల్లో మిల్లులకు తరలిస్తున్నారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు వర్షం కురువకపోవడంతో మార్కెట్‌కు వచ్చిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాలు కల్పిస్తున్నాం...

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నాం. ధాన్యం ఆరగానే కాంటా పెట్టి మిల్లులకు తరలిస్తున్నాం. గన్నీ సంచులు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాం. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని గిట్టుబాటు ధర పొందాలి.

– తిరుమల, సీఈఓ, సింగిల్ విండో, హుస్నాబాద్